క్లుప్తంగా

నేడు ఎంపీ ఈటల రాక

కమలాపూర్ : మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ బుధవారం కమలాపూర్ మండలంలో పర్యటించనున్నట్లు మాజీ ఎంపీటీసీ, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కొండం శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ నాయకుడు కసుకుంట్ల అరవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు కమలాపూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రెస్‌మీట్ నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని బీజేపీ శ్రేణులు, గ్రాడ్యుయేట్లు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో బస్టాండ్ జంక్షన్ అభివృద్ధి పనులు (లైన్ షిఫ్టింగ్) కారణంగా నేడు (బుధవారం) ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ ఏఈ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్కతుర్తి గ్రానైట్ ఫీడర్, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, టౌన్ ఫీడర్, గ్రామీణ ఫీడర్లలో విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఆయన వెల్లడించారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆర్థికసాయం



కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన పుల్ల నాగరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతడికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. రోడ్డు ప్రమాదంలో నాగరాజు గాయపడిన విషయం తీన్మార్ మల్లన్న టీం సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కొలుగూరి ప్రవీణ్‌కుమార్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లగా వీడియో కాల్ ద్వారా నాగరాజును పరామర్శించి తీన్మార్ మల్లన్న తన టీం ద్వారా రూ.10 వేలు పంపించగా ప్రవీణ్‌కుమార్ బాధితుడికి మంగళవారం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



శాయంపేట : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం వరంగల్, నల్లగొండ, ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ బలపర్చిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి నిరంతరం కృషి చేస్తారని బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు కరపత్రాలను అందజేసి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సరోత్తంరెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో 36 ఏళ్ల అనుభవం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కానుగుల నాగరాజు, ముత్యాల శ్రీనివాస్, బాసాని విద్యాసాగర్, ఉప్పు రాజు, ఎర్ర రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

26న మహాశివరాత్రి ఉత్సవాలు



పరకాల: ఈ నెల 26న పట్టణంలోని కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాగరణ కల్యాణ మహారుద్రయాగ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం దేవస్థానంలో ఆవరణలో మహాశివరాత్రి వాల్‌పోస్టర్‌ను ధర్మకర్తలు, ఆలయ అర్చకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ప్రచార రథాన్ని ప్రారంభించారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ ఆచార్యత్వమున ఉత్సవాలను వైభోవపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు రాజేశ్వర్‌రావు తెలిపారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామి కల్యాణమహోత్సవాన్ని నిర్వహించనున్న ట్లు తెలిపారు. ధర్మకర్తలు కందుకూరి శ్రీధర్, తోట రవి, గౌరిశెట్టి నవీన్, రాజపుత్ సావులరామ్, ఈఓ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ప్రొఫెసర్లకు సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హిస్టరీ విభాగం ప్రొఫెసర్ మనోహర్, సీడీసీ డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ వరలక్ష్మిని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేడారపు సుధాకర్, తాళ్లపెల్లి నరేష్, బాధ్యులు మంగళవారం సన్మానించారు.

కూలీల ప్రాణాలతో చెలగాటం

- నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో తరలింపు
- ప్రమాదం జరిగితే..ప్రాణాలకే ముప్పు



పరకాల నుంచి కూలీలతో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనం

పరకాల: ఆటో, ట్రాలీ వాహనదారులు అత్యాశకు ఎంతో మంది అమాయక కూలీలు బలవుతున్న గుణపాఠం కావడం లేదు. వ్యవసాయ పనుల కోసం పరకాల నుంచి 10 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు ఆటో, ట్రాలీ వాహనాల్లో వెళ్లడం కూలీలకు సాధారణమైంది. ఒక్కో ఆటోలో 15 మందికి పైగా కూలీలు ప్రయాణిస్తుండగా ట్రాలీలో 20 నుంచి 30 మందికి పైగా కూలీలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఏడాది రెండు కూలీల వాహనాలు ప్రమాదాలకు గురి కాగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన విషయం అయినప్పటికీ అటు ఆటో, ట్రాలీ వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా కూలీలను తరలిస్తున్నారు. వాహనాలపై నిలబడి కొందరు ప్రయాణిస్తుండగా మరికొందరు ప్రమాదస్థాయిలో కూర్చోవడం జరుగుతుంది.

నిర్లక్ష్యంగా పోలీసులు

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు పరకాల పోలీసుల వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో సమయంలో పోలీసుస్టేషన్ ముందు నుంచి ఓవర్ లోడ్‌తో వెళ్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వాహనదారులకు ఎలాంటి కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టకపోవడంతోనే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం



ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఆటో, ట్రాలీ, ట్రాక్టర్‌లో కూలీలను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామ శివారులో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ చేపడతాం. అవసరమైతే జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తాం. – క్రాంతికుమార్, సీఐ పరకాల

మహిళలకు వ్యక్తిగత రుణాలు అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం అబ్దుల్ రహీం

- ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అబ్దుల్ రహీం

శాయంపేట : మహిళలు పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో ఉన్న వారికి ఎస్‌బీఐ ద్వారా వ్యక్తిగత రుణాలు అందిస్తామని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అబ్దుల్ రహీం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలోని సమావేశ మందిరంలో శాయంపేట, పరకాల, నడికూడ మండలాల ఏపీఎంలకు, సీసీలకు, వీఓఏలకు ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు లింకేజీ డీపీఎం దాసు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ఆర్‌ఎం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఎస్‌బీఐ ఎల్లవేళలా అందుబాటులో ఉండి రుణాలు అందిస్తామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకొని ఎలాంటి బకాయి లేకుండా చెల్లించి మళ్లీ పొందాలని తెలిపారు. ఎస్ బీఐలో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరు ప్రమాద బీమా ప్రీమియం చెల్లించి రూ. రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు లబ్ధి పొందవచ్చన్నారు. మహిళా సంఘాల్లో ఉన్న మహిళలకు తమ వ్యాపారాల అభివృద్ధికి వ్యక్తిగత రుణాలు అందజేస్తామని పే ర్కొన్నారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ లక్ష్యాలలో 100 శాతం టార్గెట్ పూర్తి చేసిన ఏపీఎంలకు, సీసీలకు, వీఓఏలను అభినందించి బహుమతులు అందజేశారు. అనంతరం మహిళా సంఘాల రుణాలతో పారిశ్రామిక వేత్తగా ఎదిగి ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న శాయంపేటకు చెందిన దాసరి కల్పనాదేవిని ఆ యన శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్లు రాజేష్, శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ అనంతరమణాచారి, బ్యాంకు లింకేజీ ఏపీఏం రా జు, ఏపీఎంలు శ్రీధర్ రెడ్డి, క్రాంతి, రమాదేవి, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



పరకాల : మాట్లాడుతున్న మంద శ్రీకాంత్

పరకాల : తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్ ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్వీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ పరకాల మండల మహాసభ నిర్వహించారు. ఈ సభనుద్దేశించి శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా విద్యార్థులకు సంబంధిత ఒక్క సమస్య కూడా పరిష్కరించలేకపోయిందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు అద్దె భవనాల్లో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వంలో ఎలాంటి చలనం కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగ సమస్యలపై స్పందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బండి జశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ హేమంత్, బొచ్చు ఈశ్వర్, చెన్నూరి సాయికుమార్, యశ్వంత్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

ఎస్ఎఫ్ఐ మండల మహాసభ సందర్భంగా పరకాల మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మడికొండ ప్రశాంత్, కార్యదర్శిగా కోగిల ప్రేమ్, ఉపాధ్యక్షులుగా గౌతమ్‌కుమార్, ప్రశాంత్, సహాయ కార్యదర్శులుగా అనిల్, గణేష్, కమిటీ సభ్యులుగా సాయినాని సిద్ధు, దివ్య, మానస, అంజలి, నందిని, కావ్యశ్రీలను ఎన్నుకున్నారు.

శాయంపేట మండల కమిటీ ఎన్నిక

శాయంపేట : మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మందల శ్రీకాంత్ తెలిపారు. అధ్యక్షుడిగా సిద్దార్థ, కార్యదర్శిగా ఎండీ ఇస్మాయిల్, ఉపాధ్యక్షులుగా గణేష్, భరత్, సహాయ కార్యదర్శిగా అయాన్, అభి, సభ్యులుగా భానుశ్రీ, వరుణ్, అజయ్, అక్షిత, మహేందర్, ఉమేష్, సమీర్, మనోజ్, అశ్వితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కల్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బీరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ హేమంత్, బొచ్చు ఈశ్వర్, చెన్నూరి సాయికుమార్, పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ మడికొండ ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్ తదితర ఆట సామగ్రి, చదువులకు అవసరమయ్యే డిక్షనరీలను పంపిణీ చేశారు. అలాగే 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎలుగం శ్రీధర్, మాజీ అధ్యక్షుడు పొన్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎస్.అమర్నాథ్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యుడు బెలిదె కిషన్, పూర్వ విద్యార్థులు, మాజీ ఎంపీపీ రాజారపు యాదగిరి, సోమ అమర్ నాథ్, అశోక్, హెచ్ఎం రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28 వరకు కులగణన రీ సర్వే

కమలాపూర్ : కులగణన రీసర్వేకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, గతంలో సర్వేలో వివరాలు ఇవ్వని వారు ఈ నెల 28 వరకు మూడు విధాలుగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని ఎంపీడీఓ గుండె బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటగా వెబ్‌సైట్లో సర్వే దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూరించి యజమాని సంతకం చేసి ఎంపీడీఓ కార్యాలయంలో కార్యాలయ పని వేళల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలన్నారు. రెండోది నేరుగా మీ ఆధార్‌కార్డులు, బ్యాంకు పట్టాదారు పాస్‌పుస్తకాలు తదితర వివరాలతో ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి మీ వివరాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. మూడోది మీ మొబైల్ నుంచి 04021111111 నంబర్‌కు ఫోన్ చేసి మీ వివరాలు నమోదు చేసుకోవాలని కోరినట్లెతై ఎన్యుమరేటర్లు నేరుగా మీ ఇంటికొచ్చి వివరాలు సేకరిస్తారని ఎంపీడీఓ బాబు తెలిపారు.

కమలాపూర్‌లో మాజీ జవాన్ వీరంగం

- తాళ్లతో కట్టేసి ఇంట్లో వదిలిపెట్టిన పోలీసులు



మహేశ్‌కు లుంగీ కట్టి తాళ్లతో కట్టేసిన స్థానికులు, పోలీసులు

కమలాపూర్: మండల కేంద్రంలో ఓ మాజీ జవాన్ మంగళవారం సాయంత్రం నగ్నంగా తిరుగుతూ వీరంగం సృష్టించాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గతంలో జవాన్‌గా పని చేసిన మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన మార్త మహేశ్ కమలాపూర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ కూడలి వద్ద బట్టలన్నీ విప్పేసుకుని నగ్నంగా తిరుగుతూ న్యూసెన్స్ సృష్టించాడు. వచ్చిపోయే వాహనాలను ఆపి, కార్లపైకి ఎక్కి నగ్న ప్రదర్శనతో సుమారు అరగంట పాటు న్యూసెన్స్ చేయగా భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు స్థానికుల సాయంతో అతడికి లుంగీ చుట్టి తాళ్లతో కట్టేశారు. అనంతరం అతడిని ఓ ట్రాలీ ఆటోలో ఎక్కించుకుని శనిగరంలోని అతని ఇంటికి తీసుకెళ్లగా అతని ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో ఇంటి తాళాలు తొలగించి అతన్ని ఇంట్లో వదిలిపెట్టారు. కాగా మహేశ్ సోమవారం మధ్యాహ్నం కూడా కమలాపూర్ పాత గ్రామ పంచాయతీ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్దకు వెళ్లి వీరంగం సృష్టించడంతో పాటు ఆ పక్కనే ఉన్న సుభాష్‌చంద్రబోస్ విగ్రహంపై తన దుస్తులు కప్పి కాసేపు వీరంగం సృష్టించాడని గ్రామస్తులు తెలిపారు. మహేశ్‌కు మతిస్థిమితం సరిగా లేదని గ్రామస్తులు తెలిపారు. కాగా మహేశ్ ప్రస్తుతం జవాన్‌గా పని చేస్తున్నాడా? లేదా అనేది మాత్రం తెలియరాలేదు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ఎంపీడీఓ గుండె బాబు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ

కమలాపూర్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ గుండె బాబు ఆదేశించారు. మండలంలోని దేశరాజుపల్లిలో మంగళవారం ఆయన పర్యటించి స్థానిక ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. అంతకు ముందు ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో ఓ రైతు నిర్మించుకుంటున్న పశువుల పాకను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, హెచ్ఎం స్వర్ణ, అంగన్‌వాడీ టీచర్ శోభ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఉన్నారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్ర పూజలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలో స్వయంభూగా వెలిసిన స్తంభ నారసింహుడికి, గర్భాలయంలోని శ్రీలక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం అభిషేకం, సుదర్శన నారసింహ హవనం, కల్యాణం జరిపించారు. నిత్యపూజల అనంతరం ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. అనంతరం అర్చకులు సుదర్శన నారసింహ హోమం వేదోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ-నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి-వేంకటేశ్వర స్వామిల ఉత్సవ మూర్తులకు కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం జరిపించారు. అర్చన, నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్రహారతి సమర్పించారు. వెంకటరత్నం, జయకృష్ణ, అరుణ్‌కుమార్, విక్రమ్, భక్తులు పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన సీఐకి సన్మానం



సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న గ్రామస్తులు

శాయంపేట : మండలంలోని ఆరెపల్లికి చెందిన బొందమ్మ అనే వృద్ధురాలిని 2023 మార్చి 26న హత్య చేసిన కేసును స్థానిక సీఐ రంజిత్‌రావు, ఎస్సై జక్కుల పరమేశ్, ఏఎస్సై రాజు, కానిస్టేబుల్స్ అశోక్, సతీష్‌లు ఛేదించి నిందితుడైన రాజిరెడ్డిని పరకాల సీఐకి అప్పగించినందుకు ఆరెపల్లికి చెందిన బొందమ్మ కుమారుడు వాడికాల రాజేశ్వరరావు, కోడలు జ్యోతి, మున్నూరుకాపు సంఘం మండల ప్రధాన కార్యదర్శి అడప ప్రభాకర్, గ్రామస్తులు సీఐ, ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుళ్లను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ రంజిత్‌రావు మాట్లాడుతూ వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝా, డీసీపీలు, పరకాల ఏసీపీ బొందమ్మ హత్య కేసు ఛేదించడానికి తనను నియమించినట్లు తెలిపారు. ఎవరైనా నేరం చేసి దొరకం అనుకుంటే అది తప్పని తెలంగాణ పోలీస్‌ల దగ్గర అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, మ్యాన్‌వల్ టెక్నాలజీ ఉందని ఏదో ఒక రోజు 100 శాతం దొరుకుతారని తెలిపారు. ఎవరికైనా ఏదైనా గొడవలు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. హత్యలు చేసి ఎవరు తప్పించుకోలేరని ఇలాంటి నేరాలు చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీషీటర్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

క్రైం కార్నర్

యువకుడిపై దాడి



చికిత్స పొందుతున్న పవన్

దామెర : మండలంలోని ఊరుగొండకు చెందిన ఒడిదోలు పవన్‌ను తన ఇంటి వద్ద ఏటూరునాగారం గ్రామానికి చెందిన నూనె రాకేష్, దిలీప్‌లు దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి ఏటూరునాగారం గ్రామానికి చెందిన రాకేష్, దిలీప్‌లు మా ఇంటికి వచ్చి కూర్చొని మాట్లాడినట్లు చేసి మా కుమారుడు పవన్‌తో మాట్లాడే పని ఉందని చెప్పి ద్విచక్ర వాహనంపై బయటికి తీసుకెళ్లారు. రాత్రి 10 అవుతున్నా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళనకు గురయ్యామన్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఒళ్లంతా గాయాలతో ఇంటికి వచ్చాడు. పవన్‌ను వివరాలు అడుగగా తనపై ఏదో చల్లడంతో స్పృహతప్పి పడిపోయానని తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు రాకేష్, దిలీప్ అతని అనుచరులు కారులో వెనుకభాగంలో సీట్ల మధ్యలో వేసి కాళ్లతో తొక్కుకుంటూ, కొట్టుకుంటూ ఊరుగొండ గుట్ట వద్దకు తీసుకొచ్చి చంపడానికి ప్రయత్నించగా తప్పించుకొని వచ్చానని తెలిపాడు. ఒంటిపై ఉన్న గాయాలను చూసి పవన్‌ను ఆస్పత్రికి తరలించామని 24 గంటలు గడిస్తే గాని ఆరోగ్య పరిస్థితి చెబుతామని డాక్టర్లు తెలిపారన్నారు. పవన్‌పై దాడి చేసిన రాకేష్, దిలీప్, ఐదుగురు అనుచరులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని యువకుడి తల్లి కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా తనకు ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత



నడికూడ : పట్టుకున్న రేషన్‌బియ్యంతో ఎస్సై

నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ గ్రామం వద్ద మంగళవారం దామెర పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ట్రాలీ ఆటో పట్టుబడింది. అందులో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన తెట్టె రాజు, డ్రైవర్ బోయిని కృష్ణలను అదుపులోకి తీసుకొని దామెర పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ముల్కనూరులో 10 క్వింటాళ్లు..

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామ శివారులోని సమ్మక్క-సారలమ్మ గద్దెల సమీపంలో మంగళవారం ఓ బొలెరో వాహనంలో అక్రమంగా 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా స్థానిక ఎస్సై సాయిబాబు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా రేషన్ బియ్యం అక్రమంగా తరలించినట్లు తెలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం



వేలేరు : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని గుండ్లసాగర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన టీకుల సమ్మయ్య కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా గ్రామంలో సరిగా కూలీ పనులు దొరకపోవడంతో కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వలసవెళ్లాడు. పూరిగుడిసెలో అతడి తండ్రి వెంకటయ్య ఒక్కడే ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వెంకటయ్య పనిమీద బయటకు వెళ్లగా తిరిగి ఇంటికి వచ్చేసరికే గుడిసె కాలుతుండటంతో చుట్టుపక్కల వారితో కలిసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశాడు. గుడిసెలో బట్టలు, నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి.


ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించండి



మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

ఆత్మకూరు: నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక ప్రధాన సంపాదకులు మాణిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన యూటీఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా విద్యారంగానికి, ఉపాధ్యాయ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ శాసనమండలి వేదికగా అనేకసార్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నర్సిరెడ్డిని మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, ఆత్మకూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, సునీల్ కుమార్, టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు రమణ, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల నియామకంలో అన్యాయం



మాట్లాడుతున్న రామన్న నాయక్

నయీంనగర్: 2008 డీఎస్సీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఏజెన్సీ అభ్యర్థుల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల నియామకంలో అన్యాయం జరిగిందని, అవకతవకలకు పాల్పడిన డీఈఓ వాసంతిపై చర్యలు తీసుకోవాలని నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్, ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రామన్న మాట్లాడుతూ హనుమకొండ డీఈఓ కార్యాలయంలో జరిగిన తప్పిదం వల్ల తాము ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగులుగా మిగిలిపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగినా సెలెక్షన్ లిస్టులో తమ పేర్లు రాలేదని వాపోయారు. ప్రభుత్వం పునఃపరిశీలన చేసి ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు.

జాతీయ సదస్సు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మార్చి 26, 27వ తేదీల్లో కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్ డిసిప్లినరీ మెటీరియల్ సైన్స్ ఫర్ సస్టైనబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాల్‌మెంట్' అనే అంశంపై నిర్వహించనున్న జాతీయ సదస్సు వాల్‌పోస్టర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, సదస్సు కన్వీనర్ పి.అరుణ, భౌతికశాస్త్ర విభాగాధిపతి కవిత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేష్‌బాబు, అధ్యాపకులు కొలిపాక శ్రీనివాస్, జ్యోతి, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.